# మమత

మడత కుర్చీలో పేపరు చదువుతున్న దెవరో వంటింట్లో నుంచి తేరిపార చూసింది మాలతి. తెరుచుకున్న పేపరు ముఖానికి అడ్డంగా ఉంది. కాళ్ళు కనిపిస్తున్నాయి లుంగీపంచ గాలికి పాదాలపైన కదులు తోంది. "డాడీ" (మామగారిని అలా పిలవడం మాలతి కిష్టం) అయితే తెల్లపంచ ఉండాలి గదా! ఈ వేళప్పుడు అందులో కూర్చునేది ఆయనే మరి! కుళాయినీళ్ళు పట్టుకోవడం అయింది గదా అని టిఫిన్ పెడదామని చూసింది.

అనుమానంతో దగ్గర కొచ్చింది. "ఇదేమిటి మీ రిక్కడ బైఠాయించారు. డాడీ ఏరి?" ఆరాతీస్తూ అడిగింది భర్త ప్రకాశాన్ని.

పేపరు పక్కకు మడుస్తూ, "మరీ బాగుంది. నన్నడుగుతా వేంటి నాకేం తెలుసు?" ఎదురు ప్రశ్నతో జవాబిచ్చాడు.

మాలతి అటూ ఇటూ చూసింది.

"నానిగాణ్ణి ఎక్కడికన్నా పంపించారా?"

"లేదు! ఇక్కడికే ఆదివారం గదా అని వేరే పేపర్లు తెమ్మన్నా"

నమ్మనట్లు "పేపర్లకా, సిగరెట్లకా?" ప్రశ్నించింది..

"నాకేం బుద్ధి లేదనుకున్నావా? మా నాన్న ఉండగా ఇంట్లో సిగరెట్లు ఎలా తాగుతాననుకున్నావ్?"

"అదిసరే...ఆదివారం ఉదయం టిఫిన్ తినందే డాడీ ఎక్కడికి వెళ్ళరే?"

ప్రకాశం మాట్లాడలేదు. మాలతికి ఏదో ఆలోచన తట్టింది.

"ఇందాక కుళాయి వస్తున్నప్పుడు మీరు మాట్లాడింది నానిగాడితో కాదా?"

భర్త ముభావంగా ఉండడంతో మాలతి అనుమానం రూఢి అయింది. "అయితే డాడీని మీరు ఏమన్నా అన్నారా?"

"అర్థంపర్థం లేని ప్రశ్నలు వేయడమేనా నీ పని?" సూటిగా సమాధానం చెప్పకుండా చిరుకోపంతో అన్నాడు.

"నా ప్రశ్నలు సరైనవే. చెప్పండి. ఏమన్నారు? ఇది ఆయన బయటకి వెళ్ళే టైంకాదు. టిఫిన్ తిన్నాకే వెళ్లారు. ఊఁ చెప్పండి మీ నిర్వాకం" రెట్టించింది.

ప్రకాశం లోలోపల ఏదో గొణిగాడు. "ఏమిటి నీ దబాయింపు? నాన్న వచ్చిన ఈ రెండు వారాల్లో నువ్వు చాల మారేవే? ఆయన అలకా నీ గారాబాలు బావున్నాయ్."

"ఈ డొంక తిరుగుడు కబుర్లు కట్టిపెట్టి అసలు సంగతి చెప్పండి."

"మా నాన్నంటే నాకన్నా నీవే ఎక్కువ అప్యాయత ఒలకపోస్తున్నట్టు మాట్లాడుతున్నావే?"

"అవతల నాకు వంటింట్లో పనులున్నాయి. నేఅడిగింది చెప్పండి ఊరికే తర్కించకుండా వయసు మళ్ళిన వాళ్ళు పిల్లల్లో సమానం. నానిగాడెంతో డాడీ అంతే. మగాళ్ళు మీకేం తెలుస్తుంది?"

"అయితే నన్నేం చేయమంటావ్?" గొంతు పెంచాడు.

మాలతీ గ్రహించింది.

"డాడీ చేయబోయే పని ఏదైనా వద్దన్నారా?"

"అవును. బకెట్టుతో నీళ్ళు తెస్తానంటారాయన. నడుం పట్టేస్తుందే మోనని నా భయం. మీకెందు కొచ్చిన పని. హాయిగా కూర్చోకూడదా అన్నా." గొంతు తగ్గించి తానేం తప్పు చేయలేదన్నట్లు సంజాయిషీగా చెప్పాడు.

"ఘనకార్యం చేశారు. అసలే డాడీ సెన్సిటివ్. మీకేమో ఎలా చెప్పాలో తెలియదు. మాట్లాడే తీరులో ఉంటుంది. పైగా ఊరికే ఉంటే తోచదు ఆ వయసులో. ఏదో చేయాలని తాపత్రయం ఉంటుంది. దాన్ని గ్రహించి నచ్చచెప్పాలి. బుజ్జగించాలి."

"నువ్వు చేస్తున్నావుగా?"

"ఇంతకీ డాడీ ఎటు వెళ్ళారో....పాపం టిఫిన్ తినలేదు."

నాని పేపర్లు తెచ్చి తండ్రికిచ్చాడు.

"ఏరా నానీ తాతయ్య కనిపించారా ఎక్కడైనా?" అడిగింది మాలతి.

"నేవస్తుంటే పార్కు గేట్లోంచి లోపలి కెళ్తున్నారు."

ప్రకాశం తప్పు చేసినట్లు ముఖం పెట్టి—

"నువ్వు టిఫిన్ అరేంజి చేయి. నే వెళ్ళి పిలుచుకొస్తా." సూచించాడు.

"అక్కడికెళ్ళి కంప్లైంట్ చేయమంటూ మాట్లాడతారు మీరు. అసలు చెడుతుంది."

"ఎందుకలా మాట్లాడతావు? నాకూ లోకజ్ఞానం ఉంది."

"సంతోషం! మీరే సర్టిఫికెట్టు ఇచ్చుకుంటున్నారు. మీరేం వెళ్ళక్కర్లా. మీకూ నాసికి టిఫిను పెట్టాలంటూ ఉండండి" అని వంటింట్లోకి వెళ్ళింది.

ప్రకాశం ఏదో నసిగాడు. "ఇద్దరికి సరిపోయింది" అనే మాటలు వినిపించాయి.

ఇల్లిసైన రెండు ప్లేట్లలో ఇడ్లీ పెట్టి చట్నీ వేసింది. మంచినీళ్ళు పెట్టింది.

ప్లాస్టిక్ బుట్టలో టిఫిన్ డబ్బాలో ఇడ్లీ, చట్నీ పెట్టుకుని రెండు గ్లాసులు, మంచి నీళ్ళ సీసా, ఖాళీ సంచి కూడా సర్దింది.

ప్రకాశానికి అర్థం కావేదు.

"ఇదంతా ఎమిటి?"

"మీరు చేసిన దానికి పరిహారం.... పార్కుకి వెళ్తున్నా. నేను కూడా టిఫిన్ అక్కడే తింటాను" అని చెప్పి అభిప్రాయం కోసం ఆగకుండా బయటికి నడిచింది.

పార్కు దగ్గర్లోనే ఉంది.

గేట్లోంచి లోపలికి వెళ్ళి నిలబడి అన్ని వైపులా చూసింది కొంతదూరంలో చెట్టు నీడలో బెంచీమీద మామగారు కనిపించారు

"ఈయనకెలా భీమరాజని పేరు పెట్టారో గాని పట్టి బేలగుంటె. చిన్న పిల్లవాడి మనస్తత్వం" అనుకుంది. పెదవుల మీద చిరునవ్వులు చెంగలించాయి.

ముగ్గు బుట్టలాంటి తల వృద్ధాప్యాన్ని చెబుతోంది. వెనక్కి ఆను కుని చెట్ల ఆకుల్లోంచి ఆకాశంవైపు చూస్తున్నాడు.

మాలతి గుండె జాలితో పొంగింది "ప్రతి చిన్నదానికి మనసు నొచ్చుకునే చిత్రమైన వైఖరి. మళ్ళీ మనిషిలో కోపం ఉండదు." పని

వానిలా అడగటం. బ్రతిమాలితే కరిగిపోయే తత్వం" అనుకుంటూ మెల్లగా చెట్టు దగ్గరి కెళ్ళింది కనిపించకుండా.

చెట్టు పక్కనుంచి "డాడీ" అని పిలిచింది.

భీమరాజు పిలుపు విని ఆశ్చర్యంతో అటూ ఇటూ చూశాడు. ఎవరూ లేరు. భ్రమపడుతున్నానేమో అనుకున్నాడు.

మాలతి ఒక్క నిమిషం ఆగింది.

శబ్దం వచ్చిన వైపు చూశాడు భీమరాజు. ఎవరూ కనిపించలేదు. లేచి అటు వెళ్ళబోయాడు. మాలతి ప్లాస్టిక్ బుట్టలో తనవైపే రావడం గమనించి ఆగిపోయాడు.

మళ్ళి బెంచే మీద కూర్చుండి పోయాడు. మాలతి వచ్చి బెంచి మీద కూర్చుంది.

భీమరాజు ఏమీ మాట్లాడలేదు. తల పక్కకు తిప్పుకున్నాడు. మాలతి లేచి వచ్చి అటుపక్కగా కూర్చుంది.

"డాడీ డాడీ" బుజ్జగిస్తున్నట్లు పిలిచింది.

భీమరాజు మొహంలో గంభీరముద్ర తగ్గిపోయింది.

"మీ అబ్బాయిదే తప్పు డాడీ సీళ్ళు తెస్తానంటే వద్దంటారా? నాలుగు జాడించాలెంతి. మీ సంగతి ఆయన కేం తెలుసు. పెద్ద బకెట్ బదులు మీకు చిన్న బకెటో, గిన్నో ఇస్తే బావుండేది. అబ్బే ఆయనకేం తెలియదు డాడీ."

తన కొడుకుని మరీ తెలివి తక్కువ వాడుగా జమకట్టడం ఇష్టం లేనట్లు "అదికాదమ్మా! మరీ పనేం లేకుండా ఊరికే ఎలా కూర్చోను? వాడిదీ తప్పులేదులే. మోయలేనని అలా అన్నాడు" సర్ది చెప్పాడు. బుట్టవైపు చూసి "ఇదంతా ఏమిటి?" అన్నాడు.

"వన ఉపాహారం ఇక్కడే. మనం టిఫిన్ తినేది."

"ఎందుకమ్మా? నాకేం కోపం లేదు. ఊరికే వచ్చా పార్కుకి."

"డాడీ? టిఫిన్ తినకుండా ఎప్పుడైనా ఇలా వచ్చారా మీరు? మీ అబ్బాయి మీద అలిగితే నన్ను శిక్షిస్తారా?" ప్లేటులో ఇడ్లీ పెడుతూ అంది.

"శిక్షేమిటి తల్లీ? నువ్వేం చేశావని? వాడు కూడా నా మీద ప్రేమతోనే ఆ మాటన్నాడు."

ప్లేటు అందించింది.

"చట్నీ మహారుచిగా ఉందమ్మా."

"ఇంకో ఇడ్లీ వేస్తా."

"ఇంకొద్దమ్మా. అరగొద్దూ? నువ్వు తిను."

భీమరాజు కళ్ళలో తృప్తి ఆనందం చూసి, మాలతి పొందిన సంతోషానికి మేర లేదు.

ఇద్దరూ తినడం పూర్తయింది ప్లేట్లు కడిగి బుట్టలో సర్దింది.

"అమ్మాయ్! ఇదీ బాగానే ఉందమ్మా, దూరంగా ఏదైనా పెద్ద పార్కుకి వెళ్ళి ఏకంగా అందరం భోజనాలు చేస్తే భేషుగ్గా ఉంటుంది."

"అయితే వచ్చే ఆదివారం ప్రోగ్రాం పెట్టుకుందాం. ఇంటికి వెళ్దామా డాడీ?"

"పదమ్మా. ఆ సంచీ తెచ్చావెందుకు తల్లీ?"

"మరిచే పోయాడాడీ? ఈ పూటకి మంచి కూరల్లేవ్."

"ఆ మాట చెప్పవేం తల్లీ. నే ఉన్నాగా? అలా కాలు సాగినట్లూ ఉంటుంది. కూరలు తెచ్చినట్లూ అవుతుంది."

"సరే డాడీ."

భీమరాజు కూరల మార్కెటువైపు, మాలతి ఇంటివైపు నడిచారు.

మాలతీ ఒకత్తే రావడం గమనించిన ప్రకాశ్, "మా నాన్న రాలేదా?" అడిగాడు. గొంతులో ఆత్రుత అలుముకుంది.

"నేను మీలాగా కాదు నమ్మండి. డాడీని కూరలకు పంపాను."

"నే వెళ్ళే వాణ్ణిగా?" విసురుగా అన్నాడు.

"తగ్గండి మహాశయా నిజంగా మీకేం తెలియదు. కూరలుతెస్తే ఆయనకెంత తృప్తిగా ఉంటోంది మీరెవ్వరైనా ఊహించారా? తాము కూడా ఏదో పని చేస్తున్నామనే విశ్వాసం ఏర్పడుతుంది. అదొక గొప్ప శాటిస్‌ఫాక్షన్ మనిషికి అదే ఆనందం ఇస్తుంది."

ప్రకాశం వెంటనే ఏమీ అనలేదు. అంగీకరిస్తున్నట్లు తల ఊపాడు "సరేలేవోయ్ పెద్ద సిద్ధాంతం కనిపెట్టావ్" అన్నాడు పైకి మాత్రం.

"నన్నేం ఎగతాళి చెయ్యక్కర్లే. మీరు గ్రహిస్తేచాలు."

"గ్రహించాను మహారాణీ గ్రహించాను. ఇక నీ పని చూసుకో నేను పేపరు చదువుకోవాలి."

"చదువుకోండి... ఎవరొద్దన్నారు?"

మాలతి లోపలికెళ్ళింది. అల్లంత దూరంలో కూరల సంచి ఊపుకుంటూ వస్తున్న తండ్రిని చూసి ప్రకాశం హృదయం ఆనందంతో సందడించింది.